నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, గురువారం 22 ఆగస్టు 2024 | PEDDAPALLI


## రాఖీ ఆదాయం ₹9.63కోట్లు

కరీంనగర్ రీజియన్‌కు మూడు రోజుల్లోనే దండిగా..

తెలంగాణచౌక్, ఆగస్టు21: రాఖీపౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు దండిగా ఆదాయం సమకూరింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం ముందస్తు ప్రణాళికలు రూపొందించింది. రద్దీ ఎక్కువ ఉండే రూట్లలో అదనపు బస్సులను నడిపించింది. అందులో భాగంగా ఈ నెల 18 నుంచి 20వరకు అదనంగా నడిపించిన బస్సులతో ₹96కోట్ల 63లక్షల46వేల ఆదాయం సమకూరింది. రాఖీ పౌర్ణమి ఒక్క రోజే ₹3.75కోట్ల ఆదాయం వచ్చింది. రీజియన్ పరిధిలోని 11డిపోల నుంచి గ్రామాలకు ప్రత్యేక బస్సులు నడిపించగా, జిల్లా కేంద్రం నుంచి జేబీఎస్‌కు-జేబీఎస్ నుంచి కరీంనగర్ ప్రత్యేకంగా 786బస్సులు నడిపించింది. మూడు రోజుల్లో రీజియన్ పరిధిలో 876 బస్సుల ద్వారా 17లక్షల 9వేల20 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చింది. సోదరులకు రాఖీ కట్టేందుకు 12లక్షల 53వేల 96మంది మహిళలు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. పండుగ సందర్భంగా మూడు రోజుల్లోనే ₹9.60కోట్ల ఆదాయం సమకూరిందని, సమష్టి కృషితో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కరీంనగర్ రీజియన్ మేనేజర్ సుచరిత తెలిపారు.

పైడిమడుగు పరేషాన్

# గోడు పట్టదు.. గోస తీరదు

ఫీల్డ్ విజిట్ FIELD VISIT

కోరుట్ల మండలం పైడిమడుగులో నిరసన తెలుపుతున్న రైతులు



## రుణమాఫీ వ్యథలు ఎన్నెన్నో

- పైడిమడుగులో వందలాది మంది పేర్లు గల్లంతు
- ఇక్కడి ఇండియన్ బ్యాంకులో లోన్ తీసుకున్న ఏడు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి
- 1,338 మందిలో కేవలం 208 మందికే మాఫీ
- సర్కారు తీరుపై మండిపడుతున్న రైతులు

**రుణమాఫీ కథ నడుస్తూనే ఉన్నది. ఊరికో వ్యథ.. ఒడువని ముచ్చటలా సాగుతున్నది. కాంగ్రెస్ సర్కారు పాపం.. రైతులకు శాపంలా మారింది. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేశామని ప్రభుత్వ పెద్దలు గొప్పలకు పోతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం బాధితుల లెక్క బయటికొస్తున్నది. ఎంతమందికి ఎగనామం పెట్టిందో లెక్క తేలుతున్నది. అందుకు కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామమే నిదర్శనంగా నిలుస్తున్నది. 600 మంది లోన్ తీసుకుంటే సవాలక్ష కొర్రీలు పెట్టి దాదాపు 400 మందికి మొండిచెయ్యి చూపింది. ఇక్కడి ఇండియన్ బ్యాంకులో లోన్ తీసుకున్న ఏడు గ్రామాల్లోని రైతుల పరిస్థితి ఇదే. 1338 మందిలో కేవలం 208 మందికే మాఫీ చేసి దాదాపు 1138 మందికి ఎగనామం పెట్టడం ధోఖాకు అద్దంపడుతున్నది.**

జగిత్యాల, ఆగస్టు 21, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల టౌన్/కోరుట్ల రూరల్: 'ఇదేం రుణమాఫీ? ఇదేం కథ? అంతా ఫాల్తు ముచ్చట' అంటూ కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామ రైతులు ఆగ్రహిస్తున్నారు. గ్రామంలో వందలాది మందికి మాఫీ కాకపోవడంతో ప్రభుత్వ చర్యపై, అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పైడిమడుగు పూర్తిగా వ్యవసాయాధారిత గ్రామం. దాదాపు 900 మంది రైతులు ఉండగా, గ్రామంలో ఇండియన్ బ్యాంక్ ఉన్నది. అలాగే సింగిల్ విండో బ్యాంకు సైతం నడుస్తుంది. పైడిమడుగు ఇండియన్ బ్యాంకు పరిధిలో పైడిమడుగుతోపాటు మాదాపూర్, రామారావుపల్లి, చర్లకొండాపూర్, రాయికల్ మండలం మైతాపూర్ తదితర గ్రామాల రైతులకు ఖాతాలు ఉన్నాయి. ఇండియన్ బ్యాంకు పరిధిలో మొత్తం 1,338 మంది పంట రుణాలను తీసుకున్నారు. అందులో లక్ష రూపాయల లోపు రుణం పొందిన వారు 800 మంది, లక్షన్నర లోపు రుణం పొందిన వారు 238 మంది, ₹2లక్షల రుణం పొందిన వారు 300 మంది ఉండగా, మొత్తంగా 208 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. ₹లక్ష లోపు రుణం ఉన్న వారికి ఎవరికి రుణమాఫీ జరగలేదు. ₹లక్షన్నర రుణం పొందిన వారిలో 170 మందికి, 2లక్షల లోపు రుణమాఫీ కేవలం 38 మందికి మాత్రమే జరిగింది. మొత్తంగా 208 మందికి రుణమాఫీ జరుగగా, 1130 మంది మాఫీకి నోచుకోలేదు. మాఫీ 15శాతానికి దాటలేదు. ఇక పైడిమడుగు పీఏసీఎస్ పరిధిలో దాదాపు 600 మంది రైతులు పంట రుణం పొందగా, 400 మందికి రుణమాఫీ జరుగకపోవడంతో పైడిమడుగు గ్రామ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' పైడిమడుగులో ఫీల్డ్ విజిట్ చేయగా, విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ పేర్లు రాయాలని కోరడం, అలాగే పైడిమడుగు పక్కనే ఉన్న చిన్నమెట్‌పల్లి, మాదాపూర్ గ్రామాలకు చెందిన రైతులు సైతం తమ పేర్లు ప్రచురించాలంటూ వచ్చారు. సర్కారు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు రైతుల మాటల్లోనే..

### ముగ్గురు ఆడపిల్లలు ఎలా బతికేది?



మాది చిన్నమెట్‌పల్లి. నా భార్య పద్మ. నేను ఇద్దరం రైతులమే. ఉన్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంట ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటున్న. ఉన్న భూమి మీద ₹1.40 లక్షల లోన్ ఇండియన్ బ్యాంకుల తీసుకున్న. రెండో దఫాలో మాఫీ కాలేదు. ఎందుకు కాలేదంటే మూడో దఫాలో అయితదన్నరు. మూడో లిస్టులో నా పేరు లేదు. ఏమైందంటే చెప్పరు. పోని నేను వడ్డీ కట్టలేదా..? అంటే కట్టిన. డిసెంబర్ 9 నాటికి నేను కేవలం ₹1,38,303 బాకీ ఉన్న అని చెబుతున్నరు. మరి ఎందుకు మాఫీ కాలేదు అంటే సప్పుడు లేదు.

**- వొల్లెం కొమురయ్య, చిన్నమెట్‌పల్లి**

### నాకెందుకు రాలేదో



నాకు నాలుగెకరాల భూమి ఉంది. పసుపు, మక్క, వరి వేస్త. ఇద్దరం భార్యాభర్తలం రైతులమే. నాకు కేసీఆర్ చేసినప్పుడు 2023 అక్టోబర్ నెలలో ₹లక్ష లోన్ మాఫీ అయ్యింది. మళ్ల అదే లోన్‌ను రెన్యువల్ చేసుకున్న. మీకు నాలుగెకరాల భూమి ఉంది కదా..? ₹2లక్షలు తీసుకోమని ఇండియన్ బ్యాంకు సార్లు అంటే అక్టోబర్ 29న తీసుకున్న. ప్రతి నెలా మిత్తి కడుతూనే ఉన్న. నాకు రెండు లక్షలు రుణమాఫీ కాలేదు. ఎందుకో అర్థమైతలేదు. డిసెంబర్ 9 లోపల తీసుకున్నవాళ్లకు వస్తదన్నరు. మరి నాకెందుకు రాలేదో తెల్వదు.

**- నేమిండ్ల మల్లారెడ్డి, పైడిమడుగు**

### తిప్పించుకునుడు మంచిదికాదు



నాకు పైడిమడుగులో రెండున్నర ఎకరాల భూమి ఉంది. పొలం, మక్క వేసుకొని బతుకుతున్న. పైడిమడుగు కో ఆపరేటివ్ బ్యాంకులో నాకు ఖాతా ఉంది. ఈ యేడాది నవంబర్‌లో పంట కోసం ₹1.70 లక్షలు లోన్ తీసుకున్న. నాకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదంటే ఎవ్వరు సప్పుడు చేత్తలేరు. బ్యాంకుకు వెళ్లి అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. వ్యవసాయ అధికారులను కలువమంటున్నారు. వారిని కలిస్తే బ్యాంకులో అడుగుమంటున్నరు. ఏ ముచ్చట సక్కగ చెప్పడం లేదు. గిట్ల మమ్ముల తిప్పించుకునుడు మంచిదికాదు.

**- దుంపల ప్రదీప్, పైడిమడుగు**

### ఉత్త ముచ్చట.. గిట్ల చేస్తరా సార్



నాకు ఊళ్లే నాలుగెకరాల ఎవుసం ఉన్నది. నేను, నా భర్త చిన్న రాజేశం ఇద్దరం ఎవుసం చేసే బతుకుతం. మా ఇద్దరు కొడుకులు పెద్దోళ్లు అయ్యిన్రు. వాళ్లది వాళ్లే. మాది మేమే జేసుకుంటున్నం. ఎకరంన్నర మక్క ఏసినం. మిగిలింది పొలం చేస్తున్నం. 2018లో ఇండియన్ బ్యాంకులో ₹85వేల లోన్ తీసుకున్న. ఆ పైసలు మాఫీ కాలేదు. చానా రోజుల సంది తిరుగుతున్నం. కాలేదంటున్రు. బ్యాంకుకు పోతే వ్యవసాయ అధికారికి దగ్గరకు పొమ్మంటరు. అడికి పోతే బ్యాంకుకు పొమ్మంటరు. ఏం తెలుస్తలేదు. లోన్ మాఫీ అంతా ఉత్త ముచ్చట. గిట్ల ప్రజలను మోసం చేయడం కరెక్ట్ కాదు సార్.

**- సంగని లక్ష్మి, పైడిమడుగు**

### తిరిగి తిరిగి రేగాళ్లు పడుతున్నయి.



నాకు పైడిమడుగులో ఉన్నదే 25 గుంటల భూమి. ఇండియన్ బ్యాంకులో ₹25వేల అప్పు తీసుకున్న. మిత్తి కట్టుకుంటనే అచ్చిన. నాకు లోన్ మాఫీ కాలేదు. ఫస్ట్, ఫస్టే అయితది అన్నరు. కాలేదు. రెండోసారి, మూడోసారి అని సమాధానం దాటిచ్చిన్రు. నాకు రుణమాఫీ ఎందుకు రాలేదో తెలువదు. బ్యాంకుకు, వ్యవసాయ ఆఫీస్ చుట్టు తిరిగి తిరిగి రేగాళ్లు పడుతున్నాయి.

**- ఆసిరెడ్డి నర్సారెడ్డి, పైడిమడుగు**

### ఎందుకు రాలేదో తెలువదట



చిన్నమెట్‌పల్లిలో ఆరెకరాల వ్యవసాయం ఉంది. నేను నా భార్య, ఇద్దరం ఎవుసం చేసుకొనే బతుకుతం. అది తప్ప మాకు ఇంకోటి తెలువదు. పైడిమడుగు ఇండియన్ బ్యాంకులో ఖాతా ఉంది. నాలుగేండ్ల కింద బ్యాంకులో పంట కోసం ₹1.60 లక్షలు లోన్ తీసుకున్న. క్రమం తప్పకుండా లోన్ కడుతున్న. ఏడాది ఏడాదికి రెన్యువల్ చేసుకుంటున్న. కానీ నా లోన్ మాఫీ కాలేదు. ఎందుకు కాలేదంటే ఎవరూ చెబుతలేరు. బ్యాంకు అధికారులే తప్పు చేసినట్లు అనిపిస్తున్నది. ప్రతి ఏడాది రెన్యువల్ చేసుకున్న తేదీనే లోన్ తీసుకున్న తేదీగా చూపాలె. కానీ, బ్యాంకు అధికారులు అలా కాకుండా రైతులు ఫస్ట్ లోన్ తీసుకున్న తేదీని చూపడంతో రుణమాఫీ జరుగలేదనిపిస్తుంది. నాకు న్యాయం చేయాలి.

**- నాగులపల్లి హన్మాండ్లు, చిన్నమెట్‌పల్లి**

### కేసీఆర్ రెండుసార్లు మాఫీ చేసిండు



కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి ఉండంగ నాకు రెండు సార్లు మాఫీ అయ్యింది. ఇప్పుడు అయిత లేదంటున్నరు. ఏందో తెలువదు. నాకు ఇద్దరు కొడుకులు. పెద్దవాళ్లే పెండ్లిండ్లు అయినయి. వాళ్లది వాళ్లు ఉంటున్రు. నాది నేను ఉంటున్న. ఆడమనిషినే అయినా నాకు ఎవుసం చేసుడు ఇష్టం. ఇప్పటికీ చేస్తూనే ఉన్న. నాకు 34 గుంటల భూమి ఉన్నది. దీన్ని పొలం చేస్తున్న. నేను ఇండియన్ బ్యాంకుల మునుపు రెండుసార్లు లోన్ తీసుకున్న. కేసీఆర్ ముఖ్యమంత్రి అయినంక మొదటి సారి ₹28వేలు, రెండోతాప ₹38వేలు మాఫీ చేసిండు. ఏడాది కింద మళ్లీ ₹35వేలు అప్పు తీసుకున్న. అవి మాఫీ కాలేదు. మస్తు సార్లు బ్యాంకుకు పోయి అడిగిన నాకు కాలేదన్నరు. సీఎం రేవంతం సార్ గిట్ల చేసుడు అన్యాయం. ముసలోళ్లను తిప్పితిప్పి సంపుడు ఏందో అర్థమైతలేదు. ఇత్తే ఇయ్యాలే. లేకుంటే లేదు. ఇత్తున్న అని చెప్పి ఎగవెట్టుడు మంచిగ లేదు.

**- వాసాల వెంకటరాజు, పైడిమడుగు**

### అడిగితే చెప్పటోళ్లు లేరు



నాకు ఉన్నది 35 గుంటల భూమి. దాన్ని నమ్ముకొనే బతుకుతన్నం. ఇండియన్ బ్యాంకులో మూడేండ్ల కింద ₹35వేల లోన్ తీసుకున్న. ఈదు గీసినట్లు నెలనెలా మిత్తి కట్టిన. నెలనెలా వడ్డీ మాత్రం తప్పకుండా కడుతూనే వచ్చిన. అట్లనే ప్రతి ఏడు జూన్‌లో రెన్యువల్ చేసుకుంటూనే ఉన్న. నా ₹35వేల లోన్ ఫస్ట్ తాపకే మాఫీ కావాలె. బ్యాంకుకు పోయి అడిగితే తెలువదు అని చెప్పిన్రు. రెండోసారి అయితదన్నరు. అప్పుడూ కాలె. ఇప్పుడు మూడోసారి మాఫీ కాలె. ఇంతకంటే అన్యాయం మరొకటి లేదు. అసలు ఎందుకు మాఫీ కాలేదు అని అడిగితే చెప్పటోళ్లు లేరు.

**- నాగిరెడ్డి దశరథం. పైడిమడుగు**

### నాశనమైపోతరు



మాది చిన్నమెట్‌పల్లి. రెండు ఎకరాల భూమి ఉంది. నా భర్త పేరు జగదీశ్వర్. మాకున్న కొద్దిపాటి భూమిని నమ్ముకొనే ఇద్దరు పిల్లలు, కుటుంబం అంతా బతుకుతున్నం. పంట రుణం మాఫీ చేస్తమంటే నమ్మితిమి. ఇప్పుడు గిట్ల చేసుడు మంచిది కాదు. డిసెంబర్ 9వ తేదీ నాటికి నాకు ₹99,564 వేల లోన్ ఇండియన్ బ్యాంకులో ఉన్నది. ఫస్ట్ లిస్టులో మాఫీ కాలేదు. రెండోదాంట్లో కాలేదు. మూడో దాంట్లోను పేరు లేదు. గిట్ల అయితే ఎట్ల. మాలాంటి చిన్నోళ్లను మోసం చేసేటోళ్లు నాశనమైపోతరు.

**- దువ్వాక పద్మ. చిన్నమెట్‌పల్లి**

# రైతన్నకు తోడుగా




## రుణమాఫీ కోసం నేడు బీఆర్ఎస్ ధర్నాలు

- సర్కారు ధోఖాపై అన్నదాతల ఆగ్రహం
- మద్దతుగా గులాబీ పోరుబాట
- నేడు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు

**బీఆర్ఎస్ మరోసారి పోరు బాటపట్టింది. రుణమాఫీ పేరిట ధోఖా ఇచ్చిన కాంగ్రెస్ సర్కారుపై కొట్లాటకు దిగుతున్నది. ఈ నెల 15వ తేదీలోగా ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి, వేలాది మందికి ఎగనామంపెట్టడంపై ఆగ్రహిస్తున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గురువారం నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలకు గులాబీదళం సిద్ధమైంది. రైతులతో కలిసి ధర్నాలు చేసి, ప్రభుత్వ తీరును ఎండగట్టనున్నది.**

కరీంనగర్, ఆగస్టు 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల ముందు ఏకకాలంలో ₹2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు రైతులకు ధోఖా చేసింది. ఎంతో ఆశతో ఎదురుచూసిన అన్నదాతలకు ఎగనామం పెట్టింది. మొదటి, రెండో, మూడో విడుతలో అనేక కొర్రీలు పెట్టి వేలాది మంది నోట్లో మట్టికొట్టింది. రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆగమైపోతూ, బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో నిరాశే మిగులుతున్నది. ఈ క్రమంలో మోసపోయిన రైతన్నకు బీఆర్ఎస్ మరోసారి అండగా నిలుస్తున్నది. ఎండకాలంలో సాగు నీటి కోసం, పంట కొనుగోళ్ల కోసం తండ్లాడిన సందర్భాల్లో రైతు పక్షాన నిలిచి నిరసన తెలిపింది. ఇప్పుడు రుణమాఫీ కోసం ఆగవుతున్న తరుణంలో సర్కారు తీరును ఎండగట్టి, రైతులకు న్యాయం చేసేందుకు నడుంబిగించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు చేయబోతున్నది. కాగా, కాంగ్రెస్ సర్కారు మోసపూరిత వైఖరికి నిరసగా చేపట్టబోయే ధర్నాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కోరుతున్నారు. రైతులతోపాటు రైతు సంఘాల నాయకులు, గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని మండిపడ్డారు. రైతుల పక్షాన ఎంతకైనా తెగిస్తామని, రుణమాఫీ అందరికీ అమలు చేసేదేకా వదిలేది లేదని స్పష్టం చేశారు.

# మంథనిలో డయాలసిస్ సేవలు

- ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఆగస్టు 21: మారుమూల ప్రాంతమైన మంథనిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సెంటర్ సేవలను కిడ్నీ బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. మంథని ప్రభుత్వ దవాఖానలో ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌ను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి బుధవారం ప్రారంభించారు. వైద్య నిపుణులతో మాట్లాడి సెంటర్‌లోని పరికరాల పనితీరును తెలుసుకున్నారు. డయాలసిస్ సెంటర్ మంజూరు చేసిందుకు సీఎం, డిప్యూటీ సీఎం, వైద్యారోగ్య శాఖ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన తెలంగాణలో సింగిల్ యూజ్డ్ ఫిల్టర్ ద్వారా డయాలసిస్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. డయాలసిస్ బాధితులకు అవసరమైన మేరకు పరికరాలను అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో గుంజపడుగులో ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఇంటింటికీ సర్వే చేపట్టి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని మంత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ మంథనిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయ డం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిప ల్ చైర్‌పర్సన్ రమ, ఆర్డీవో హనుమా నాయక్, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు ఇనుముల సతీశ్, అయిలి ప్రసాద్, శశిభూషణ్ కాచే, ఒడ్నాల శ్రీనివాస్ ఉన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు

# పూడూర్‌లో రైతుల పోరు

- రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బలవంతంగా లాక్కెళ్లిన పోలీసులు

కొడిమ్యాల, ఆగస్టు 21: రుణమాఫీ చేస్తామని నమ్మించి మోసం చేసిన సర్కారుపై రైతులు భగ్గుమన్నారు. పూడూర్‌లో జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆందోళనలో పాల్గొన్నారు. రోడ్డుపై పడుకొని నిరసన తెలిపారు. ఆందోళన తీవ్రం కావడం, గంటపాటు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో సుంకె రవిశంకర్‌ను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లారు. ఖాకీల వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం ప్రజాపాలన అని నిలదీశారు. ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు అరకొరగా లోన్లు మాఫీ చేసి నిండా ముంచారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతుభరోసాను ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ ఆందోళనలో తిర్మలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పొలు రాజేందర్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, మాజీ సర్పంచులు ఏగుర్ల తిరుపతి, గరిగంటి మల్లేశం,సయ్యద్ హైదర్, నాయకులు బోడ్డు రమేశ్, మల్యాల నరేశ్, గోలి ఐలయ్య, సల్మాన్, సురభి సాగర్‌రావు, రేకులపల్లి తిరుపతిరెడ్డి, ఒల్లాల లింగాగౌడ్, రాచకొండ చంద్రమోహన్, గుంటి తిరుపతి,కొత్తూరి స్వామి, చాంద్‌పాషా, పర్లపల్లి సురేశ్ పాల్గొన్నారు.

# చెట్లలాగే విద్యార్థులు ఎదగాలి



విద్యార్థులతో కలసి మొక్క నాటి నీరు పోస్తున్న కళాశాల చైర్మన్ సాగర్ రావు

- జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు
- కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌కు ఓరియంటేషన్ ప్రోగ్రాం

తిమ్మాపూర్ రూరల్, 21: విద్యార్థులందరూ చెట్ల లాగే చదువులో రాణిస్తూ ఉన్నతులుగా ఎదగాలని జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు ఆకాంక్షించారు. తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌కు ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం ప్లాంటేషన్ చేపట్టారు. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సాగర్ రావు, కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్ సాయి కాలేజీ ఆవరణలో 1500 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జువ్వాడి మాట్లాడుతూ ఫస్టియర్‌కు చెందిన ప్రతి విద్యార్థి మొక్కలు నాటి సంరక్షించాలని ఉద్బోధించారు. కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, అధునాతన ప్రయోగశాలలు, గ్రంథాలయం, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. కళాశాల అమెరికాలోని లూసియా నాటెక్ యూనివర్సిటీ, టీ హబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్ డాక్టర్ పీకే వైశాలి పాల్గొన్నారు.




కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు

# మీ పాత ఫోన్లు అమ్ముతున్నారా.. జాగ్రత్త!

- ప్రజల నుంచి కొని సైబర్ నేరగాళ్లకు సరఫరా
- తాజాగా ఎన్టీపీసీలో నలుగురు కొనుగోలుదారుల అరెస్ట్
- ఐదు సంచుల్లో 4వేల ఫోన్లు స్వాధీనం

జ్యోతినగర్, ఆగస్టు 21: మీ పాత ఫోన్లు అమ్ముతున్నారా..? డబ్బులు వస్తున్నాయని ఆశపడి మీ పనికిరాని ఫోన్‌ను విక్రయిస్తున్నారా..? అయితే జాగ్రత్త! ఇలా అమ్మడం వల్ల భవిష్యత్తులో మీరు ఇబ్బందులు పడే ప్రమాదం ఉండవచ్చు! ఎందుకంటారా..? అయితే చదవండి.. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో బిహార్‌కు చెందిన కొందరు వ్యక్తులు పాత మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్న సమాచారం మేరకు రామగుండం సైబర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో కృష్ణమూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లారు. ఆ ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ షమీమ్, అబ్దుల్ సలాం, మొహమ్మద్ ఇఫ్తికార్, అఖ్తర్ అలీని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. వారంతా బీహార్‌లోని హతియా దియారాకు చెందినవారుగా గుర్తించి, వారి నుంచి ఐదు సంచుల్లో 4వేల పాత ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫోన్లను తమ సహచర వ్యక్తికి అమ్మితే, అతను జార్ఖండ్ రాష్ట్రంలోని జమ్తారా, దియోఘర్ ప్రాంతాలకు చెందిన సైబర్ నేరగాళ్లకు సరఫరా చేస్తాడని విచారణలో ఒప్పుకొన్నారు. వారు ఫోన్లకు మరమ్మతులు చేసి, సైబర్ మోసాలకు పాల్పడుతారని తెలిపారు. దీంతో ఫోన్ ఐఎంఈఐ నంబర్ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదమున్నదని, అలాగే మీ డాటా రికవరీ చేసి బ్లాక్‌మెయిల్ చేసే ముప్పు ఉన్నదని పోలీసులు హెచ్చరించారు. ఎవరైనా పాత ఫోన్లను విక్రయించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరికి పడితే వారికి విక్రయించవద్దని సూచించారు.



స్వాధీనం చేసుకున్న ఫోన్లు